శివ వేంకటీయ గ్రంథమాల. పంచమపుష్పం.

పామఱ్ఱు (స్తూప) జయధ్వజ చరిత్ర.

ఇది

1913 సం॥ 12 డిశంబరు తేదీని జరిగిన ఢిల్లీపట్టాభిషేక స్మరణచిహ్నా
తృతీయవర్ష వర్థంతిమహోత్సవసమయమందు
శ్రీమత్పంచమజార్జిచక్రవర్తివిజయడిండిమ
మై వెలువడునటుల

అడవి సాంబశివరావు
నందగిరి వేంకటప్పారావు
అను
శివ వేంకటకవులచే

విరచింపఁబడి

పామఱ్ఱు కారొనేషన్ కమిటీవారిచేఁ
బ్రచురింపఁబడియె.

బెజవాడ వాణీముద్రాక్షరశాలయందు
బి. కే. స్వామిచే
ముద్రింపఁబడినది.

మొదటికూర్పు 500 ప్రతులు.

1914.

కాపీరైటు]. [వెల రు 0_1_0.

శివ వేంకటీయ గ్రంథమాల. పంచమపుష్పం.

పామఱ్ఱు (స్తూప) జయధ్వజ చరిత్ర.

ఇది

1913 సం॥ 12 డిశంబరు తేదీని జరిగిన ఢిల్లీపట్టాభిషేక స్మరణచిహ్న

తృతీయవర్ష వర్ధంతిమహోత్సవసమయమందు

శ్రీమత్పంచమజార్జిచక్రవర్తివిజయడిండిమమై వెలువడునటుల

అడివి సాంబశివరావు

నంద[illegible] వేంకటస[illegible]రావు

అను

శివ వేంకటకవులచే

విరచింపఁబడి

పామఱ్ఱు కారోనేషన్ కమిటీవారిచేఁ

ప్రచురింపఁబడియె.

బెజవాడ వాణీముద్రాక్షరశాలయందు

బి. కే. స్వామిచే

ముద్రింపఁబడినది.

మొదటికూర్పు 500 ప్రతులు.

1914.

పీఠిక.

శ్రీమదనంతాఖ్యాన్వర్థకావనీచక్రంబునం గల సకల మానవజాతులకుం బితృ మాతృ దేవ భూధవభక్తిపూజలలో రాజభక్తియే ప్రప్రథమగణ్యంబై, సంతతాచరణీయంబై, నితాంతానందదాయకంబై, యనంతఫలసౌఖ్యప్రదంబై, యాజన్మాంతరక్షణకృత్యంబై యొప్పారుచుండె. తత్కారణం బేమన! జననీజనకులు బాల్యావస్థాంతముదనుక నే ప్రోదిసేయుదురు; పిమ్మట మరణాంతమువఱకు భూనేతయే పోషింపవలసియున్నది. అనిర్వాచ్యస్వరూపుండగు దేవుండు మనల కఖిలసౌఖ్యంబులొడఁగూర్చు నింద్రియావయవంబులను, సర్వవస్తు సముదాయంబులను దయాదృష్టితో సృష్టించియున్నను భూభృద్రక్షితులము గాకున్నచోఁ బ్రయోజనంబులం గననేరము. పూర్వపురాణదృష్టాంతంబులేగాని ప్రస్తుతము ప్రత్యక్షముగా నీశ్వరుండు మనకు వరంబులొసంగుట కలలోనివార్తలని లోకజ్ఞానులకు వేఱుగాఁ జెప్పనక్కఱలేదుగదా. ప్రాచీనార్యులు గూడ "నావిష్ణుః పృథివీపతి" అని దైవస్వరూపుడు భూలోకమున భూపతియేయని వక్కాణించియుండిరి. గావున రాజభక్తి ప్రతిమానవునకు సంపత్కరంబని నిశ్చయార్థం బిడుచున్నది.

శ్రీమత్పంచమజార్జిచక్రవర్తికిని, మేరీచక్రవర్తినికిని ఆ 1911 సం॥రము డిశెంబరు 12వ దినమున ఢిల్లీలోఁ బట్టాభిషేకంబయినదని యెల్లరకుం దెలిసినవిషయమేగదా. ఆనంద

ర్భమునఁ దదీయజ్ఞాపకార్థంబై మా పామర్రుగ్రామంబున శ్రీ డిప్యూటీతహశ్శీలు దాగువారగు మహమ్మదు హుమాయూన్ సాహెబుగారి ప్రోత్సాహంబుచే నొక శిలాస్తంభంబు ప్రతిష్ఠింపఁబడియె. ఆ మహామహుని రాజభక్తిని, రాజభక్తి ప్రపూర్ణామృతవచనబోధావిర్భూత కార్యసాఫల్యమును వెల్లడించు కవిశిఖామణులు మాయూర లేనందున నేఁటి కాకో అంత బ్రహ్మశ్రీ శివవేంకటకవులచే నివారింపంబడినది. ప్రయాసమని యెన్నక మాకోర్కె నీడేర్చి వందనీయులయిన యేతత్కవుల కనేకవందనంబు లాచరించుచు, వారి చరిత్రము నించుక దెల్పి కృతజ్ఞతాసూచకుల మగుచున్నారము.

(1) ఈ కవులలో మొదటివారు బ్రహ్మశ్రీ అడవి సాంబశివరావుపంతులుగారు. వీరి నివాసము కైకలూరుతాలూకా బొమ్మినంపాడు. ఆంధ్రమత్స్యపురాణ బిల్వనాథీయ సాత్రాజితీయ ప్రముఖోద్గ్రంథముల నిరువదైదు రచించిరి. నియోగిబ్రాహ్మణులు. సాంఖ్యాయనసగోత్రీకులు.

(2) రెండవవారు మధ్వశ్రీ నందగిరి వేంకటప్పారావుపంతులుగారు. గుడివాడతాలూకా అంగలూరునివాసులు. మధ్వబ్రాహ్మణులు. విశ్వామిత్రసగోత్రీకులు. శ్రీమద్రామాయణాద్భుతోత్తరకాండ, శుద్ధాంధ్ర భీమసేనవిజయాది పంచవింశతి గ్రంథకర్తలు. పదాఱేండ్ల ప్రాయంబుననే యష్టావధానమొనర్చిన మేధావంతులు. వ్యయప్రయాసలకోర్చి తమ నివాసగ్రామంబున బాలికాపాఠశాల స్థాపించి యత్యున్నతస్థితికిఁ దెచ్చిన మహాదాతలు. స్వార్థత్యాగులు.

(3) వీరిరువురు చిరకాల స్నేహితులు. సమవయస్కులు. (సుమా రేబదేండ్ల వయస్సుగలవారలు) సమ గోత్రీకులు. సహాజపాండిత్యులు. ఉభయభాషా కోవిదులు, గానఁ దమ మిత్రత్వమును సార్థకపరచుకొనుటకై తమ హృదయమ్ముల కుం బలెనే తమ నామంబులకుంగూడ మిత్రత్వముం గలుగఁ జేసి "శివవేంకటకవులను" మిశ్రమనామము ధరించి 1912సం॥ రము మొదలు, కనకదుర్గాస్తోత్రరత్నమాల, బ్రహ్మాపత్రా భ్యుదయము, జగన్నాధీయాది షష్టకుసుమంబులచే శివవేంక టీయ గ్రంథమాలనలంకరించిరి. ఈమధ్య శ్రీవడాలి జగన్నాధ దేవస్థానపరిపాలకులచే "ప్రబంధకవిపంచానన" మను బిరుద ము నందినట్లు తెలియుచున్నది. కవితాకన్యక వీరియభీష్టముల నంతతం బిచ్చుచుండుఁగాక.

ఇట్లు బుధవిధేయుఁడు,

పామఱ్ఱు,
15—5—1914.

B. NAGIREDDI.
కాలక్షేపక్లబ్ కమిటి మెంబరు,
పామఱ్ఱు, కృష్ణాజిల్లా.

శ్రీరస్తు.

పామఱ్ఱు జయధ్వజ చరిత్ర.

శా. శ్రీవిద్యోతసమస్తలోకపటలీ
సృష్టిస్థితిక్షేపణ
ప్రావీణ్యోల్లసదాత్మశక్తిమహిమో
పస్యస్తసర్వేశ్వర
త్వావిఖ్యాతదయామయాకృతియుతుం
డై సర్వగుం డామహా
దేవుం డీయుత జార్జిభూమిపతికిన్
దీర్ఘాయురారోగ్యముల్.

మ. చిరకారుణ్యముతోడ హైందవజన
క్షేమార్థియై హాస్తినా
పురసింహాసన మెక్కి భారతమహీ
భూయిష్ఠ తేజోమహ
త్తరఁ గావించినజార్జిభూపతిజయ
స్తంభంబు పామఱ్ఱులో
స్థిర మై యారవితారకంబుగను ద
చ్చిహ్నంబుగా నొప్పుతన్.

క. భూషణమై పామర్రికి
శేషుఁడు ధర మోచి యుల్లసిలునంతకు సం
తోషమున జార్జికారో
నేషన్ కమిటీ దృఢముగ నెగడెడుఁ గాతన్.

పామఱ్ఱు జయస్తంభము.

క్రీ-శ 1911 సం॥ రంది 12 డిశంబరు తేదీకి హిందూదేశమునకు సుమారు రెండువందలసంవత్సరములనుండి కలుగఁ జాలనిమహైశ్వర్యము, మహాగౌరవము లభ్య మైనది. కావున అనుదినము సువర్ణాక్షరములతో వ్రాసి యుంపఁ దగినమహాధనము. ఆ సుదినము రాజభక్తిపూరితు లగుహైందవులకుఁ దరతరములను జ్ఞాపకమునం దుంచుకొని, పూజింప వలసినట్టి దివ్యధనము. భారతీయులమనంబుల రాజదర్శనము లేక చిరకాలమునుండి నాటుకొనినయజ్ఞానాంధకారంబు దూరంబుసేయుటకు లభ్య మైనవిమలజ్ఞానాంజనము. ఆమహాసుదినము తరతరములవరకు జ్ఞాపక ముండునటుల భరతవర్షంబున నెల్లెడల వివిధోపాయంబుల స్తూప, మందిర, పాఠశాలాదిచిహ్నంబులు నెలకొలుపఁబడినవి. ఇందు "స్తూప" మనునామాంతరము గల జయస్తంభమును ప్రతిష్ఠించుట, ఆ స్తంభము చలనము లేక ఆచంద్రతారకముగ నిలిచి, యనుదినము ప్రజల కీసుదినము జ్ఞాపకము సేయు చుంట కే; గాన నుత్తమసాధన మగుటకు సందియము లేదు. పామఱ్ఱుగ్రామమున నట్టిజయస్తంభ మాసుదినమున స్థాపింపఁబడినది. పూర్వకాలమున మహాకీర్తిప్రతిష్ఠలు గాంచినసర్వంసహాపతులు తమపరిపాలనజ్ఞాపకము ల

యినజయ స్తంభములు ప్రతిష్ఠించువాడుక కలదు. ఇటలీలోఁ గొన్నిజయ స్తంభములు కలవు. మహాఅలగ్జాండరు, నెపోలి యను మొదలగు మహాజయశీలురు తమజయములను దెలుపు జయ స్తంభములను నాటిరి. హిందూదేశమునందును ఈఆచా రము సంప్రదాయసిద్ధముగా వచ్చు చుండినది. కుతుబుమైనా రు ఇట్టి జయ స్తంభమే. హస్తినాపురమున మహమ్మదీయప్ర భువులు నాటినజయ స్తంభములు గలవు. సింహాచలప్రాంతము న శ్రీకృష్ణదేవరాయలువారు జయ స్తంభమును నాటిరి. లె క్కింపఁ దలఁచిన నిట్టిజయ స్తంభము లక్కడక్కడ పెక్కులు గలవు. మనపాముఱ్ఱులో నిలిపినశ్రీపంచమజార్జిజయ స్తంభము ను నట్టిదే. ఇట్టిజగద్విఖ్యాతజయ స్తంభస్థాపనాధికరణం బగు పాముఱ్ఱుచరిత్ర మించుక యిచట ముచ్చటింప వలసి యున్నది.

కం. పాము వసియించుమఱ్ఱికి
గ్రామము కుఱంగఁటను గలుగఁ ♦ గాఁ గాంచిజన
స్తోమమ్ము "పాముమఱ్ఱనఁ"
బౌమ ఱ్ఱనియుదియ పిదప ♦ వాడుక పడియెన్.

ఈపాముఱ్ఱునకు సమీపమునఁ బూర్వకాలమునందు "నా గులేరు" అనుచిన్ననది ప్రవహించు చుండెడిది. ఆనదికి సమీ పమున నొకతమ్మికొలనును, దన్మధ్యమున దివ్యప్రతిష్ఠితం బగు నొకశివలింగమును గలవు. ఆకొల నెల్లకాలము నేనుఁగులోఁ తునీరు కలిగి యుండెడిది. దానినడుమ నుండినలింగమును ఆ ఏటిని మించి పైకిఁ గనఁబడు చుండెడిది. ఆలింగముయొక్క పా నుపీఠము) ఎంతలోతున నుండెడిదో తెలియ రా కుండెను.

ఆశివలింగమును బూర్వకాలమున నాగులు ప్రతిష్ఠించి రని
యు, దదభిషేకతీర్థముకొఱకే తత్సమీపమున కొంకచిన్ననదిని
దెచ్చిరనియు, నాగులు తెచ్చినది గనుకనే దానికి “నాగులే”
రనునామము కలిగెననియుఁ జరిత్రాంశమైనవృద్ధసంవాదము
కలదు. ఆశివలింగమును నిరాభరణమై, జలమధ్యగతమై, మ
హాప్రభావకలితమై, దివ్యపూజితమై యుండె నఁట. ఆలింగము
శిరంబున నొకపద్మ ముద్భవించి యెల్లవేళల వికసించి మనో
హరపరిమళంబు వెదజల్లు చుండునఁట. ఆకొలను గట్టున శా
ఖాశిఖాగ్రచుంబితదిగంత మగునొకమహావటవృక్షంబు వర్ధిల్లు
చుండెను. ఆవృక్షకోటరంబున నొకమహానాగంబు నివసించి
ప్రత్యహంబును నాశంభులింగమునకుఁ జుట్టుకొని నాగాభరణా
లంకారమై యుండునఁట. ఇట్లు చిరకాలము నడువఁ గ్రమంబు
న నాచెరువు కొంతపూడి తన్నికటమున నొకగ్రామంబు ని
ర్మింపఁబడియె. అంతఁ గొంతకాలమునకు మహమ్మదీయప్రభు
త్వము వచ్చి, హిందూదేవాలయము లున్మూలించి, మూలవి
గ్రహంబులపీఠంబులందు నిక్షేపింపఁబడినధనరాసులఁ గొల్లఁగొ
నుట తటస్థ మయ్యె. ఆమహాసంక్షోభకాలమున నొకమహ
మ్మదీయసేన యీగ్రామమార్గమునఁ బోవుచు నీలింగము మ
హాప్రభావసంపన్న మనియు, నద్భుతాకారకలిత మనియు,
హిందూజనులచే నతిభక్తిశ్రద్ధలఁ బూజింపఁబడు చున్న దని
యు విని, దీని నున్మూలించినచో దీనిక్రిందఁ బెక్కురొక్కము
సిక్కఁ గల దని తలంచి, యందునకుఁ గడంగి, తటాకముఁ జొ
చ్చి లింగమును బెరుకుటకు మనుష్యాసాధ్యము గా నంతలోఁ
ఘు గలసీ రందుండుటచే సామజంబుం బురికొలిపి దాని ను

న్మూలింపఁ జొచ్చిరి. అగ్రజంబు తనకు సహజం బగుపద్మనాళోన్మూలనాభిలాషచే లింగశీర్ష విరాజమానం బగుకమలంబు గ్రహించి లాగఁ జొచ్చినఁ గరికరాకృష్యమాణం బై లింగమూర్ధగతసరోజంబు మూఁడుపొడుగు నాళంబుతోఁ బెకలి వచ్చినఁ దద్వివరంబునుండి శోణితప్రవాహంబు పెల్లుబ్బి కొల నెల్లఁ గప్పి, లోహితద్యుతుల మప్పి, యందలి జలంబులకుఁ గీలాలనామంబు సార్థకంబు గావించె. ఆ యద్భుతం బగువిశేషంబు గాంచి భయాకులంబులై యుల్లంబులు తల్లడిల్ల నాఝల్లకులు కనుకనిం బరచిరి. లింగశిరోగ్రంబునుండి యున్మూలితం బైనపద్మనాళంబు వెడలినప్రదేశంబున నిప్పటికిని మూఁడులోఁతున గుంటపడి కనుపించుచున్నది. ఇప్పటికిని ఆ గుంటలో ప్రతిదినమును నీళ్ళుపోసి కడిగి వస్త్రఖండముచేఁ జక్కఁగాఁ దడి యొత్తుకున్న నందుఁ బూతిగంధము వెడలుచున్నది. ఇది నేటికిని ప్రత్యక్షాంశముగ నున్నది. ఇది యీశ్వరమహిమ కాక వే రేమని చెప్పవచ్చును! నవనాగరికులిట్టిసంగతులు కట్టుకథ లని, యసత్యము లని వాదింప వచ్చెదరని మే మెరుఁగుదుము; కాని సత్య మగుకథ చెప్పక, వారికి వెరచి మరుగుపరచు టుచితము కాదు గదా! అయినను ఈశ్వరమహిమ లద్భుతములు. నవనాగరికులవాదములకీశ్వరుఁడే సమాధాన మియ్య వలయుఁ గాని మనతరము కాదు. ఈ విశేషము ప్రత్యక్షముగఁ గనియు, వినియు, దద్గ్రామీణు లా లింగమునకు నిత్యపూజోపచారములు భక్తిపారీణులై జరుపుచుండిరి. కాలక్రమమున నక్కొలను పూడి, తత్పరిసరంబున గ్రామము వృద్ధి కాఁ జొచ్చినంతట, ఆలింగ మున్నస్థలము బై

టపడినందున నప్పటిభక్తాగ్రేసరు లాలింగమున కాలయమంటప ప్రాకారాదులు కట్టించి "సోమేశ్వరస్వామి" యనినామం బిడి, నిత్యోత్సవాదులు యథావిధిగ నొనర్పం జొచ్చిరి. ఆ కొలని గట్టున నుండినమఱ్ఱిచెట్టు ఇప్పు డదృశ్య మైనది; కాని ఆకాలమునం జెట్టును, దానితొఱ్ఱలోం బామును నుండుట సత్యమే అయినందున దానికెలంకుల నున్న గ్రామమునకు "పాముమఱ్ఱి" యని పేరు లభించినది. "పాము" "మఱ్ఱి" అనుపదంబులం గల మకారద్వయము అల్పప్రాణసవర్ణాక్షరము లగుటచే మిశ్రభావమొంది "పామ్మఱ్ఱి" అనంబడెను. వాడుకలో ద్విత్వము తేలి, "పామఱ్ఱి" అనియు, తుదిరేఫముమీంది ఇత్వ ముత్వమై "పామఱ్ఱు" అని వాడుకపేరై నేంటికి నట్లే పిలువంబడు చున్నది. కొందరు శ్రోత్రియప్రాయులు ప్రథమాక్షరమునకుం, గ్రారవడిం జేర్చి, "ప్రామఱ్ఱు" అందురు; గాని అది సాధువు కాదు. ఉత్పత్తి ననుసరించి జనసామాన్యమునకు వాడుకలో నుండు "పామఱ్ఱు" అనుపేరే సాధువు గాన మే మీ చరిత్రయం దాపేరునే వాడెదము. ఇది పామఱ్ఱు గ్రామమునకు సంబంధించిన పూర్వగాథ.

ఇప్పు డీగ్రామము చుట్టుపట్టులం గలగ్రామములందు గళగ్రామమై, గుడివాడతాలూకాయందు "డివిజన్" అనునంతర్భాగమునకు నాధారమై యున్నది. ఈ "డివిజన్"కు సంబంధించి 65-గ్రామము లున్నవి. డివిజన్ పరిపాలకుం డగు డిప్యూటీతహశ్శీలుదారుకార్యస్థాన మీగ్రామమందు గలదు. 1910సంవత్సరంలో తాలూకాలువిభాగించినప్పు డీ"పామఱ్ఱు" డివిజన్ గాం జేయంబడినది. ప్రథమమం దిచ్చటికి మ.రా.రా.

నందూరి రామచంద్రరావుపంతులుగారు డిప్యూటితహశ్శీలు
దారుగా 1-11-1910 తేదినవిచ్చేసి ప్రజలను దనకన్నప్రజల
వలె భావించి న్యాయముగను నెమ్మదిగను బరిపాలించి సర్వ
జనులచే మెప్పువడసిరి. కొలఁదికాలములోనే మ.రా.రా. మ
హమ్మదు హుమాయూన్ సాహెబుగా రాస్థాన మలంకరించి
రి. ఇక్కాలమే మనప్రస్తుతచరిత్రనాటకమునకు నాంది. వీరి
పరిపాలనోజ్జృంభణకాలమునందే శ్రీ శ్రీ పంచమజార్జిచక్ర
వర్తిగారు ఢిల్లీనగరంబునఁ బట్టాభిషేకమహోత్సవము
నంగీకరించినశుభదినము వచ్చినది. ద్విశతాబ్దములనుండి హిం
దూదేశమున కలభ్యమైనరాజసందర్శనమహోత్సవమున కీదే
శము పరిపూర్ణరాజదర్శనమహోత్సవమునం బొంగి పెంపునం
బొంపిరివోవురత్నాకరంబు ననుకరించి యెచ్చోటఁ జూచినఁ
బెచ్చుపెరుగుమహోత్సవములతో నుల్లసిలు చుండె. అమ్మ
హోత్సవ మిచటను శోభాయమానముగ జరుప నెంచి త
దుత్సాహపూరితు లగుమహాజనులవలన “5 వేలరూప్యంబులు
సమకూర్పఁబడి నాఁటిదినము శ్రీమచ్చక్రవర్తి, చక్రవర్తినీల
యూరేగింపుమహోత్సవము మహావైభవముతో నెరవేర్పఁ
బడి ఆసందర్భమున సంఖ్యాతీతు లగుబీదలకు అన్నదానము
సేయఁబడినది. తన్మహోత్సవజ్ఞాపకార్థ మిచ్చట „ జయ
స్తంభము” ప్రతిష్ఠింపఁబడినది. ఇదిఇచ్చట ఆచంద్రతారార్క-
ము స్థిరముగ నెలకొని ప్రజల కపూర్వభాగ్యనిదానం బగు
నమ్మహాసుదినము సర్వదా జ్ఞాపకముచేయు చున్నది. ఈ స్తం
భ మీ గ్రామముమధ్యనుండి బందరుహైదరాబాదురోడ్డు
యొక్క 15వమైలులో 5-6 ఫర్లాంగురాళ్ళమధ్య (ననగాఆరవఫ

ర్లాంగులో) పుల్లేరుకాలువయొక్క వంతెన ప్రక్క ప్రతిష్ఠింపఁబ
డినది. ఇది 14½ అడుగుల ఎత్తుగలిగి, ఎన్నఁటికిని గదల కుండున
ట్లు 6 అడుగులలోఁతునఁ బాఁతఁబడి, నడుమున నాలుగుపలక
లుగను, దానికిఁ గ్రిందను మీఁదను ఎనిమిదిపలకలుగను మ
లఁపఁబడి, చివర వట్రువుగాఁ జేయఁబడి యున్నది. దీనిమధ్యప
లకలలోఁ దూర్పువైపుపలకమీఁద "శ్రీశ్రీ పంచమజార్జిచ
క్రవర్తి శ్రీమేరీచక్రవర్తినీగార్లకు ఢిల్లీ నగరమందు
12-12-1911 తేదిని పట్టాభిషేకమహోత్సవము జరిగిన దని
జ్ఞాపకార్థ మీ స్తంభంబు ప్రతిష్ఠింపఁబడి, 14-12-1911 తేదీని,
కృష్ణాకలెక్టరు, హెచ్.ఎల్.బ్రైడ్వూడ్ దొరగారివలనఁ బ్ర
సిద్ధపరుపఁబడినది" అనుఅర్థ మిచ్చునట్టుల ఆంగ్లేయభాషలో

IN COMMEMORATION

OF THE

IMPERIAL CORONATION

ON 12-12-1911 AT DELHI

OF THEIR MOST

GRACIOUS MAJESTIES

KING-EMPEROR GEORGE V

AND

QUEEN-EMPRESS MARY.

UNVEILED ON 14-12-1911

By H. L. BRAIDWOOD Esq.,

Collector, Kistna.

అని లిఖింపఁబడి యున్నది. ఇట్టియనశ్వరమహాకార్యనిర్మాణమున కీప్రతిష్ఠాపనమే ఈతాలూకాకుఁ బ్రప్రథమము. ఈమహాకార్యము సంఘటించుటయందు శ్రీమహమ్మద్ హుమాయూన్ సాహెబుగారు చూపినశ్రద్ధ, ప్రోత్సాహము, కార్యనిర్వహణదీక్ష, అత్యంతశ్లాఘాపాత్రము లనుటకు లేశమును సందేహము లేదు. కావున నీసందర్భమునందు ఆమహాపురుషుని నించుకం తప్రశంసింపక విడుచుట మాకు ధర్మము కాదు. సత్పురుషులెరికిని వందనీయులే కదా?

హుమాయూన్ పంచరత్నావళి.

మ. పరమోత్సాహముతోడ హైందవజన
ప్రాంచన్మనోభీష్టముల్
చరితార్థంబు లొనర్పఁ బంచమమహా
జార్జిప్రభుం డంచితా
దరుఁడై ఢిల్లి మహాభిషేకపదవిన్
దాల్పంగఁ దన్మంగళా
కర మాపుణ్యదినంబు శాశ్వతముగాఁ
గన్ దెల్పఁ బామర్తిలో
స్థిర మా స్తంభము నాటె, మాకుఁ గర మ
ర్థిన్ మేలు గావించి తీ
వ్రు రు తేజోనిధనై మహమ్మదుహుమా
యూన్ సాహెబుగ్రామణి ॥

మ. చిరకష్టంబుల కోర్చి రాజ్యపదవీ
స్థేమంబుఁ బాటించి యీ

భరతఖండాన మొగలాయిరాజ్యరమ సం
భావించె మున్నె మహా
పురుషుం డాతనిపేరు నీకె తగుఁ బెం
పుం దెంపు సొం పొంద స్వా
ర్థరతిన్ గైకొన కెల్లకాలము మహా
ధర్మానుకంపానిరం
తరచిత్తంబున సంచరించుచు మహా
ధన్యత్వముం గాంచితీ
వురుతేజోనిధివై మహమ్మదుహుమా
యూన్ సాహెబుగ్రామణీ ॥

మ. ధరణిన్ జన్మము దాల్చినందులకు స
త్యస్థైమమున్ సత్కృపా
పరిణామంబు పరోపకారనిరతిన్
బాటించు టెన్నన్ మహా
పురుషాంకంబు లటంచు నీచరితమే
బోధించు వేనోళ్ళ నే
కరణిన్ ని న్ననువర్తనీయచరితున్
గాఁ బ్రస్తుతిం జేయ రి
ద్ధర ధన్యాత్ములు ని న్నెరింగిన భవ
త్కార్యంబులన్ గన్న న
త్యురుతేజోవిభవా! మహమ్మదుహుమా
యూన్ సాహెబుగ్రామణీ ॥

మ. స్థిరమై మించినదైవభక్తి యెడఁదన్
జెన్నారఁగా దానితో

సరిగా మెప్పినరాజభక్తియును నై
శ్చల్యంబునన్ నీయెడన్
గర మొప్పారెడు నీమనోద్రఢిమ యె
క్కాలంబునన్ గన్న ని
ర్భరలోకోపకృతిప్రవీణ మగుచున్
బొల్టిల్లు నీయట్టిస
త్పురుషున్ బాలకుఁ గాఁగఁ గాంచినప్రజల్
పుణ్యాత్మకు ల్గారె యు
త్యురు తేజోవిభవా! మహమ్మదుహుమా
యూన్ సాహెబుగ్రామణీ ॥

మ. మరి నీపల్కులు విన్నధన్యుఁడు సుధా
మాధుర్య మి ట్లంచుఁ దా
నెరుగున్ నిన్నొకసారిఁ గన్నసుజనుం
డిష్టార్థసంపత్తి ని
ర్భరుఁ డౌనీపరిపాలనం బవనివా
రల్ రామరాజ్యంబు వై
ఖరియెల్లన్ జవి చూతు రిట్టినిను దీ
ర్ఘప్రాభవారోగ్యసు
స్థిరసంపద్యుతుఁ జేసి బ్రోచుతఁ గృపా
దృష్టిన్ జగన్నాథుఁడ
త్యురు తేజోవిభవా!మహమ్మదుహుమా
యూన్ సాహెబుగ్రామణీ ॥

ప్రజలమనోలవాలంబుల నంకురించినరాజభక్తి మహా
దుహుమాయూన్సాహెబుగారి వాఙ్మాధుర్యరససేకము

చేఁ బ్రోదియై, పెరిగి, సత్ఫలదాయకమై, ఇంతటిమహాకార్యమొనర్చుటకు వలయుద్రవ్య మవలీల సేకరింపఁ జేయుటయే గాక, ఈప్రతిష్ఠాపన మనువత్సరమును దన్మహోత్సవసూచకంబుగఁ దత్సుదినంబున బీదల కన్నదానము సేయుట మొదలగుసత్కార్యాచరణమునకుఁగాను "కారొనేషన్ కమిటీ" అను పేర నీగ్రామమున శాశ్వతసమాజ మొకటి స్థాపింపఁ జేసినది.

ఈకమిటీకి అప్పటప్పటి కిడివిజన్కు పాలకుఁడుగా నుండుడిప్యూటీతహశ్శీలుదారుగారు ప్రసిడెంటుగను, మద్దిపట్లశెక్షన్ D. P. W. సెక్షన్ ఆఫీసరుగారు (సెక్రటరీ) కార్యదర్శిగను, పామర్తి గ్రామమునసపు (ట్రెజరర్) కోశాధికారిగను ప్రామర్తి సెక్షన్కు D. P. W. సెక్షన్ ఆఫీసరుగను, మేడూరుపరగణా ఠాణేదారుగను, అప్పటప్పటికి వచ్చువా రిందు (మెంబర్లు) సభికులుగను, తుర్లపాటి వేంకటహనుమంతరావు, ఈ సుందరరామయ్య, యూనియన్ చైర్మన్, చిర్రావూరి కామేశ్వరరావు, మహమ్మదు యూసఫ్సాహెబు, డాక్టరు ఖాజాఅసదుల్లాసాహెబు, బొమ్మారెడ్డి పిచ్చిరెడ్డి, బొమ్మారెడ్డి కోటిరెడ్డిగార్లు స్థిర మైన (మెంబర్లు) సభికులుగను ఏర్పాటు కాఁబడిరి. ఈసమాజము 12-11-1911 తేదీనే స్థాపింపఁబడి అప్పుడు ఉత్సవార్థము పోగు చేయఁబడినసొమ్ములో అప్పటి అన్ని ఖర్చులుపోఁగా మిగిలిన,రు556లును దీనికి శాశ్వతమూలధనముగ నియ్యఁబడినది. ఈమూలధనమును సేవింగ్సుబ్యాంకీలోఁగాని, సెక్యూరిటిబాండుమీఁదఁ గాని ఉంచివృద్ధిలోనికిఁ దెచ్చుచు దీనిమీఁద వచ్చెడువడ్డీవలనను, అనుకూల్యమునుపట్టి వసూలు చేయుచందాలధనమువలనను ప్రతి సంవత్సరం 12వ

డిశంబరు తారీఖున శ్రీరాజచక్రవర్తిగారి ఢిల్లీపట్టాభిషేకస్మరణచిహ్నముగ బీదలకు అన్నవస్త్రదానము చేయుచుండుట కుద్దేశింపఁబడినది. ఈసభవారియుద్దేశ మెంతయు శ్లాఘాపాత్రము. హిందూదేశ మందేమి, ఇతరదేశములం దేమి పెక్కండ్రు భూమిపాలురు, తత్స్మరణచిహ్నములుగాఁ బ్రజలు పెక్కు జయస్తంభములనుఁ బ్రతిష్ఠించిరి గాని, ఇట్టిసమాజము లేర్పడి ప్రతివత్సరమును లోకోపకారార్థ మన్నవస్త్రదానములు చేయు చుండు కట్టుపాటు లెచ్చటను లే వని చెప్పవచ్చును. ఇట్టిమహాకార్యకరణమున కీపామఱ్ఱుకారొనేషన్ కమిటీయే ప్రథమ మని తెలియ వచ్చు చున్నది. కాన నీ సమాజోద్దేశములను నిర్విఘ్నముగ కొనసాగించుచు, దీనివలనఁ బ్రజల కెడ తెగనిరాజభక్తి హృదయంబులఁ గుదురు పరుచుటకు సర్వలోకేశ్వరుం డనుగ్రహించును గాత.

సీ. అసమానరాజభ • క్తిసమేతులై ప్రజా
సామాన్యమునకు రా • జన్యభక్తి
స్థిరముగ నెలకొల్పి • పరమోపకారంబు
గావించుశ్లాఘ్యసం • కల్ప మొప్పఁ
బ్రతిసమంబును రాజ • పట్టాభిషేక మ
హోత్సవస్మరణ ప్ర • యోగసరణి
నతిబీద లగువారి • కన్నవస్త్రము లిచ్చి
తత్సుకృతంబు భూ • ధవున కంచి
గీ. తాయురారోగ్యము లొసంగు • నట్లు వేఁడి
కొనెడు సత్కార్యశూరులై • మనెడునట్టి

సాధుపామర్తి కారొనే ◆ షన్ సమాజ
సభికులను బ్రోచుఁగావుత ◆ జక్రధరుఁడు.

ఈకారొనేషన్ కమిటీ ద్వితీయసంవత్సరోత్సవము 1912 సం॥ 12 డిశంబరు తేదీని, అప్పటి డిప్యూటీ తహశ్శీలుదారుగా రగు మ. రా. రా. తాయి సుబ్బారావునాయుఁడుగారి యాజమాన్యముక్రింద జరుపఁబడినది. రాజభక్తి విషయమున మహామ్మద్ హుమాయూన్ సాహెబుగారి కేవిధమునఁ దీసిపోని సుబ్బారావునాయుఁడుగారి ప్రోత్సాహప్రయత్నములచే(రు100) నూరు రూప్యము లధికముగఁ జందాలు పోగు చేయఁబడి వేయిమంది బీదలకు అన్నవస్త్రదానము జయప్రదముగఁ జేయఁబడినది.

సీ. తతరాజభక్తి ప్ర ◆ ధానుఁడై రాజన్వ
తియగు భారతవర్ష ◆ దిష్టసూచ
నార్థతదీయ ప ◆ ట్టాభిషేకస్మర
ణాంకానువర్షోత్స ◆ వావసరము
నందు నృపాలున ◆ కభ్యుదయముఁ గోరి
ప్రజలలోపల రాజ ◆ భక్తి నిలిపి
యతిబీద లగువారి ◆ కన్నదానము చేసి
దీపితాత్మీయ ప ◆ రోపకార
గీ. కలనము కృపావిశేషంబు ◆ దెలిపినట్టి
ధన్యగుణరాశియై మించు ◆ తాయి సుబ్బ
రావునాయని నధికదీ ◆ ర్ఘాయు వొసఁగి
ఈశ్వరుం డెల్లయెడల ర ◆ క్షించుఁ గాత.

ఈ 1913 సం॥ రం॥ 12 డిశంబరు తారీఖున పట్టాభిషేక స్మరణ చిహ్న తృతీయసాంవత్సరికోత్సవము ప్రస్తుతపు డిప్యూటీ తహశ్శిలుదారు మ. రా. రా. వక్కలంక లక్ష్మీనరసింహారావు పంతులుగారి పరిపాలనక్రింద నత్యంత శ్లాఘాపాత్రముగ నెరవేరినది. అన్నదానముచే సంతృప్తు లగుబీదజనులు హర్షోత్కర్షాయత్తులై యీ మహాత్ముని గూర్చి చేయు ధన్యవాదనంబులు, జయజయారావంబులు దిగంతములు బధిరీకృతములుగావించె నని చెప్పిన నది యతిశయోక్తి కానేరదు. నిరతాన్నప్రదానజాయమానవిశదయశోముక్తా వితాన సములంకర్మీణసకలహరిదంత రావకాశం బగుసద్వంశంబున నుద్భవించిన ముక్తామణి యగునీమహానీయునివితరణగుణ మిట్టి దని వర్ణించి చెప్పుటకంటె ననవరతసమాశ్రిత సకలాభీష్టప్రవర్షణోత్కర్షం దనరుమందారతరుపంచకం బీఘనుని దక్షిణకరాంగుళిపంచకమై యవతరించెనని చెప్పుట స్వభావోక్తి గాని వేరు కానేరదు. ఈ సుగుణాభరణుని ప్రోత్సాహమే మమ్మీచరిత్రగ్రంథరచనమునకును బురికొలిపినది. కావుననీమహానీయుని నించుక ప్రశంసించి విరమించెదము.

సీ. భారతీలీలావి ♦ హారభాజనకలా
విక చప్రసూనవా ♦ టిక యనంగ
నవరసాలంకార ♦ కవితారసాపూర
కలశాంబునిధితరం ♦ గం బనంగ
గకుబంతనిహితత్యా ♦ గధ్వజాయితవితీ
ర్ణాతర్పితార్థిగ ♦ ణం బనంగ

బహురాజకార్యని ◈ ర్వహణ నైపుణ్యసం
చితకీర్తి మల్లికా ◈ లత యనంగఁ

గీ. దనరు భవదన్వవాయంబు ◈ ఘనత కీవు
నిక్కముగ ఫలరూపమ్మై ◈ నెగడితయ్యా
భవ్యగుణసంపదకలంక ◈ వక్కలంక
లక్ష్మినరసింహరాయ క ◈ ళానికాయ.

చ. నిజముగ రాజభక్తికిని
నీవె నిదానమ్మవై దృఢంబుగాఁ
బ్రజలకు నేర్పఁ జొచ్చితివి
భద్రగుణంబుల కీవె యిక్కవై
ఋజుత జనాళియం దలవ
రించితి వే మని సన్నుతింతు ని
సుజనత వక్కలంక కుల
శోభిత లక్ష్మినృసింహ పండితా.

మ. కరుణన్ బీదల కన్నవస్త్రము లొసం
గన్ నీమహోత్సాహని
ర్భరతన్ గన్గొని లేమి లేమియగుచున్
వైధాత్ర సంకల్పమున్
జరితార్థం బొనరించు నీదగుక్రియా
చాతుర్యమార్గాళి ప
ల్మరు వర్ణించును వక్కలంకకులజా
లక్ష్మీనృసింహాహ్వయా.

రూపకం - బ్యాండుమెట్టు.

౧. జార్జిచక్రవర్తికిన్ ◆ జననిమేరిరాణికిన్
ఊర్జితజయమంగళంబు ◆ లొసఁగునీశుఁ డెప్పుడున్.

౨. ఢిల్లిసింహాపీఠిపై ◆ నెల్లకాలముండుచున్
చల్లగ శిరులొందుచు వ ◆ ర్ధిల్లు చున్ద్రుగావుతన్.

3. ఆచన్ద్రమార్కమ్ముగా ◆ నలరి నిబ్బరమ్ముగన్
లేచి యశోధ్వజము లవని ◆ వెలయు చుండుఁగావుతన్.

౪. తనదు ప్రజల సాటిఁగాఁ ◆ దలఁచి మనల నూటిఁగా
ఘనుఁడు జార్జిచక్రవర్తి ◆ కాచు చుండుఁ గావుతన్.

౫. శివవేంకటేయకృతియై
చవు లిడుపామట్టు స్తంభ ◆ చారిత్రం బీ
భువి నారవితారకమై
కవిహృదయాహ్లాదకరము ◆ గా విలసిల్లున్.

సంపూర్ణము.

వెలకుదొరకు పుస్తకములపట్టి. అంచెకూలిగాక.

1 శ్రీమద్రామాయణోద్ధృతోత్తరకాండము [అపూర్వము పారాయ
ణయుక్తము రుచిరాలంకారభూయిష్టము 6 ఆశ్వాసములు] రు 1

2 జగన్నాథీయము [వడాలిమాహాత్మ్యము- అపూర్వగ్రంథము] 0

3 శుద్ధాంధ్రమేఘసందేశము } విప్రలంభశృంగారము 0

* 4 ఆంధ్రీకృతమేఘసందేశము } విప్రలంభశృంగారము 0

* 5 చంద్రిక [నవలాప్రబంధము ప్రతిస్త్రీపురుషుడు చదువదగినది] 0

6 బాలాశతకము [స్త్రీనీతులు] రెండవకూర్పు 0

7 సీతారామశతకము } భక్తిరసప్రధానములు 0

8 రామశతకము } భక్తిరసప్రధానములు 0

9 ఆదికేశవశతకము } భక్తిరసప్రధానములు 0

10 శ్రీశైల హనుమచ్ఛతకము } భక్తిరసప్రధానములు 0

11 బ్రహ్మపత్రాభ్యుదయము [పోగానమహిమ] 0

12 గంగిరెద్దు [హాస్యము] 0

13 స్త్రీవిద్యాసారసంగ్రహము [వచనము] 0

14 దొంగసామిచరిత్ర [నిజమయినకథ] 0

15 శ్రీకృష్ణమానసపూజ } సంస్కృతము రెండవకూర్పు 0

16 హరిహరస్తోత్రతారావళి } సంస్కృతము రెండవకూర్పు 0

17 కనకదుర్గాస్తోత్రరత్నమాల } సంస్కృతము రెండవకూర్పు 0.

18 అంగలూరు పితేజీభూగోళము 0.

19 పామఱ్ఱు జయధ్వజచరిత్ర 0.

20 బాలతోడవు [అమూల్యము] ఉచితముగ నొసగబ

21 నేత్రావధానచంద్రిక 0.

* అచ్చులోనున్నవి.

వలయువారు,

శివవేంకటీయ గ్రంథాలయము,

అంగలూరుపోస్టు, కృష్ణాజిల్లా.

అనివ్రాయవలయును.